క్లుప్తంగా

సూర్యదేవునికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణమూర్తి స్వామి

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉష, ఛాయ, పద్మ, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణమూర్తి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామికి పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

700 క్యూసెక్కుల సాగునీరు విడుదల

సీతానగరం: మండలంలోని పురుషోత్తపట్నం లోగల తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం నుంచి 350 క్యూసెక్కులు, పురుషోత్తపట్న ఎత్తిపోతల పథకం నుంచి 350 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశామని జలవనరులశాఖ ఏఈ సుమంత్ ఆదివారం తెలిపారు. మెట్ట ప్రాంత పంటపొలాలకు పుష్కర-1 నుంచి ఒకటి, పుష్కర-2 నుంచి ఒక మోటారు ద్వారా 350 క్యూసెక్కులు, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నుంచి 350 క్యూసెక్కుల సాగునీరు విడుదల చేశామన్నారు. పుష్కర ఎత్తిపోతల పథకం వద్ద గోదావరి నీటిమట్టం 16.8 మీటర్లు ఉందని జేఈ సుమంత్ తెలిపారు.

బీజేపీలో చేరిక



పార్టీలో చేరిన కార్యకర్తలతో సోము వీర్రాజు

రాజమహేంద్రవరం సిటీ: నిబద్ధతతో, క్రమశిక్షణతో పనిచేయడానికి సిద్ధపడి తమ పార్టీలోకి చేరుతున్నారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు పేర్కొన్నారు. ఆదివారం నగరంలో జిల్లా బీజేపీ కార్యాలయంలో రాజానగరం మండలం పాలచర్ల గ్రామానికి చెందిన బిందు భాస్కర్ ఆధ్వర్యంలో 30 మంది, రఘునాథపురం గ్రామానికి చెందిన శ్రీను ఆధ్వర్యంలో 20 మంది బీజేపీలో చేరారు. వీరికి ఆయన కండువా వేసి పార్టీలోనికి ఆహ్వానించారు. జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడబాల రామకృష్ణ, రాజానగరం అసెంబ్లీ కన్వీనర్ నీరుకొండ వీరన్నచౌదరి పాల్గొన్నారు.

విశిష్టసేవా పురస్కారంతో సంతృప్తి

మధురపూడి: గోదావరి టాలెంట్ టెస్ట్ ఆధ్వర్యంలో పొందిన విశిష్ట సేవా పురస్కారం తన రాజకీయ జీవితంలో ఎంతో సంతృప్తి నిచ్చిందని టీడీపీ సీనియర్ నేత తనకాల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగు-సాగు నీటి సాధన కోసం కృషి చేసినట్టు తెలిపారు. మెట్ట ప్రాంతమైన నాటి బూరుగుపూడి నియోజకవర్గంలో వ్యవసాయ రంగానికి రామవరపు ఆవద్వారా సాగునీటిని సాధించామన్నారు. అప్పట్లో ప్రజలకు తాగునీటితో పాటు సాగునీటి ఎద్దడి ఉండేదన్నారు. ప్రతీ ఎకరానికి నీరందాలన్న ఉద్దేశ్యంతో నాటి ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులతో పనిచేసినట్టు తెలిపారు. ప్రజాభిమానంతోనే రాజకీయంగా మంచి స్థానానికి చేరుకున్నట్టు తెలిపారు. పార్టీ నాయకులు అడపా వీరబాబు, మల్లా అప్పలనర్సారావు, పెనకటి శివాజీ పాల్గొన్నారు.

దుర్గమ్మకు వెండి అభయహస్తం బహూకరణ



అభయ హస్తం అలంకరణలో శ్రీదేవీ కనకదుర్గ అమ్మవారు

రంగంపేట: మండల పరిధిలోని చంద్రేడు గ్రామంలో కొలువైన శ్రీదేవీ కనకదుర్గ అమ్మవారికి భక్తులు వెండి అభయ హస్తం సమర్పించినట్టు ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణ తెలిపారు. గ్రామానికి చెందిన మోదుకూరి గంగరాజు కుమారు శ్రీధర్, సురేఖ దంపతులు సుమారు రూ. 21,000లతో వెండి అభయ హస్తం తయారు చేయించినట్టు చెప్పారు. ప్రత్యేక పూజల అనంతరం అభయహస్తం అమ్మవారికి అలంకరించినట్టు తెలిపారు.

ప్రమాదాల కూడళ్లు...

- వలు చోట్ల ఫ్లై ఓవర్ల నిర్మాణాలు చేపట్టాలని వినతులు
- రద్దీతో ప్రమాదాలకు నిలయంగా మారిన దివాన్ చెరువు కూడలి





రద్దీగా ఉన్న దివాన్ చెరువు కూడలి



ప్రమాద దృశ్యం (ఫైల్)

రాజానగరం: పెరుగుతున్న జనాభాతో పాటు అవసరాలు కూడా పెరుగుతున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని పాలకులు తదనుగుణంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో జాతీయ రహదారిని సైతం నాలుగు లైన్లుగా విస్తరించారు. అయితే ఈ విస్తరణలో కూడలి ప్రాంతాల మధ్య దూరం ఎక్కువగా పెట్టడంతో అటు ప్రయాణికులు, ఇటు వాహనాల రాకపోకలు అధికమై కూడలి ప్రాంతాలు రద్దీగా మారుతున్నాయి. నియోజకవర్గ పరిధిలో 18 కి.మీ.వరకు విస్తరించి ఉన్న జాతీయ రహదారిపై తూర్పుగానుగూడెం, ఏడీబీ రోడ్డు కూడలి, వైఎస్సార్ కూడలి, సూర్యారావుపేట కూడలి, గైట్ కళాశాల కూడలి, దివాన్‌చెరువు కూడళ్లు (అనధికారికంగా ఏర్పాటు చేసిన పండ్ల మార్కెట్ వద్ద కూడళ్లు) ప్రమాదాలకు నిలయంగా మారింది. గామన్ బ్రిడ్జికి వెళ్లే జీరో పాయింట్ ప్రాంతాలు రద్దీతో తరచు ప్రమాదాలకు తావిస్తున్నాయి. ముఖ్యంగా దివాన్‌చెరువులోని ప్రధాన కూడలిలో ఈ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ కారణంగా ఈ ప్రాంతంలో మోరంపూడిలో మాదిరిగా జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మించాలని స్థానికులే కాక ప్రయాణికులు సైతం పాలకులను కోరుతున్నారు.

ఏడాదిలో 6 మరణాలు, 18 మందికి గాయాలు

గడచిన తొమ్మిది నెలల్లో ఈ ప్రాంతంలో జరిగిన ప్రమాదాలలో ఆరుగురు మృత్యువాత పడగా, 18 మంది గాయాలపాలయ్యారు. ఇటు శ్రీరామపురం పుణ్యక్షేత్రం, అటు పాలచర్ల, నిడిగట్ల ప్రాంతాలకు వెళ్లేందుకు దివాన్‌చెరువు ప్రధాన కూడిలిలో క్రాస్ రోడ్లు ఉన్నాయి. దీనితో ఈ రోడ్ల నుంచి వచ్చే ప్రయాణికులు ముఖ్యంగా బైకులు, ట్రాక్టర్లపై వచ్చే వారు పల్లంలో ఉన్న ఆ ప్రాంతం నుంచి ఎగువగా ఉన్న జాతీయ రహదారి ఎక్కేందుకు కాస్త వేగంగా వస్తుంటారు. ఈ తరుణంలోనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అంతేకాక ఇరువైపులా స్కూల్స్, కళాశాలలు ఉండటంతో సైతం ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ కూడలి వద్ద విపరీతమైన రద్దీ ఏర్పడుతుంది. తొందరపడి కూడలిని క్రాస్ చేసేందుకు ప్రయత్నిస్తే.. ప్రమాదానికి గురికాక తప్పదు. సాయంత్రం వేళలో బొమ్మూరు పోలీసులు ఒకరిద్దరు ఇక్కడ గస్తీ ఉన్నాగాని, వాహనాల రద్దీని నియంత్రించ లేకపోతున్నారు. ఈ నేపథ్యంలో మోరంపూడిలో మాదిరిగా ఫ్లైఓవర్ నిర్మించాలనే డిమాండ్ ఎక్కువగా వినిపిస్తోంది.

పండ్ల మార్కెట్ నుంచి జీరో పాయింట్ వరకు..

దివాన్ చెరువు ప్రధాన కూడలిలో పెరుగుతున్న రద్దీని దృష్టిలో పెట్టుకుని ఈ కూడలికి కొద్దిపాటి దూరంలో ఉన్న పండ్ల మార్కెట్ వద్ద అనధికార కూడలిని స్థానికులు ఏర్పాటు చేసుకున్నారు. జాతీయ రహదారి విభాగం ఏర్పాటు చేసిన కూడలి వద్ద ఇరువైపులా ఖాళీ ఎక్కువగా ఉంటుంది. అయితే ఈ అనధికార కూడలి వద్ద ఆ విధంగా లేక పోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతుంది. ఫ్లైఓవర్ నిర్మాణం జరిగితే పండ్ల మార్కెట్ నుంచి గామన్ బ్రిడ్జికి వెళ్లే జీరో పాయింట్ మార్గం వరకు నిర్మించవలసి ఉంటుంది.

ఫ్లై ఓవర్ నిర్మించాలి



దివాన్‌చెరువు కూడలిలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో తరచు ప్రమాదాలకు కారణమవుతుంది. దీని నివారణకు ఫ్లైవోవర్ నిర్మాణం జరుగవలసి ఉంది. దీనిపై ఇప్పటికే పలుమార్లు ప్రజా ప్రతినిధులకు విన్నపాలు చేశాం. అలాగే జాతీయ రహదారిపై ఇతర ప్రాంతాలలో వేసినట్టుగా డివైడర్‌పై లైటింగ్ లేదు. ఇది కూడా ఎంతో అవసరం.

ఎల్. డేవిడ్‌రాజు, సామాజిక కార్యకర్త, దివాన్‌చెరువు.

జనసాంద్రతకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలి



సీజనల్ వారీగా లభించే వివిధ రకాల పండ్లకు పేరొందిన మార్కెట్‌గా దివాన్ చెరువు అభివృద్ధి చెందుతుంది. అలాగే పరిసరాలలో స్కూల్స్, కాలేజీలు కూడా ఉండటంతో ఈ ప్రాంతంలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీని నివారణకు ఫ్లైవోవర్ నిర్మాణం జరుపవలసి ఉంది. రాబోయే పుష్కరాలను దృష్టిలో పెట్టుకొని సాధ్యమైనంత త్వరగా ఈ పనులు పూర్తి చేయాలి.

సుబ్రహ్మణ్యం, ప్రయాణికుడు, రాధేయపాలెం

అగ్నిమాపక సంఘం జాయింట్ సెక్రటరీగా ఆకుల నరేష్



అగ్ని మాపకశాఖ ఉద్యోగుల సంఘం జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన నరేష్ కుమార్,సభ్యులు

పెదపూడి: తూర్పుగోదావరి జిల్లా అగ్ని మాపకశాఖ ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీగా అనపర్తి నుంచి ఆకుల నరేష్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయన ఆదివారం అనపర్తిలో మాట్లాడారు. కాకినాడలో శనివారం ప్రభుత్వ అసోసియేషన్ బిల్డింగ్‌లో ఎన్నికలు జరిగినట్లు ఆయన తెలిపారు. ఈ ఎన్నికలో ఎన్నికల అధికారిగా పీ.బాలకృష్ణ, సహాయ ఎన్నికల అధికారులుగా గణేష్ సప్తగిరి , పీవీవీ సత్యనారాయణ వ్యవహరించినట్లు చెప్పారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడిగా యాతం సతీష్ కుమార్, ఉపాధ్యక్షుడిగా రామకృష్ణదొర, కార్యదర్శిగా జీ.పీ.మోహన్ కుమార్, జాయింట్ సెక్రటరీగా ఆకుల నరేష్‌కుమార్, కోశాధికారిగా వి.సుబ్రహ్మణ్యం, సలహాదారుగా కె.మురళీకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి కేంద్ర అగ్నిమాపక అధికారి జే.శ్రీనివాసారెడ్డి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు కె.ఎస్.ఎన్.మూర్తి, డీ.ఎల్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెంకటరమణకు గాంధీ శాంతి సేవారత్న అవార్డు



ప్రముఖుల చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వెంకటరమణ

రంగంపేట: ఇండియన్ యాక్స్ అవేర్నస్ వాలంటరీ ఆర్గనైజేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వడిశలేరు గ్రామానికి చెందిన కుందేటి వెంకట రమణకు మహాత్మా గాంధీ శాంతి సేవారత్న అవార్డు లభించింది. శనివారం రాత్రి అంతర్జాతీయ గుర్తింపు పొందిన మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ కళాభారతి సిటీ కల్చరల్ సెంటర్‌లో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో భాగంగా మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, మనం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ చక్రవర్తి, నిజాం యూనివర్సిటీ ప్రొఫెసర్ భవానీ శంకర్ తదితర ప్రముఖుల చేతుల మీదుగా మహాత్మా గాంధీ శాంతి సేవా రత్న అవార్డు వెంకటరమణ అందుకున్నారు. అయ్యంకి సురేష్‌బాబు ఆధ్వర్యంలో భారతీయ సంవిధానం 1950, భారతీయ శిక్షాస్మృతి 1860, సమాచార హక్కు చట్టం 2005 వంటి చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించినందుకు ఈ పురస్కారం లభించినట్లు సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు పెంటగట్ల మణికుమార్, యాంకర్ అర్చన, కాళ్లూరి కృష్ణమోహన్, లోక మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

రోడ్లపై షిల్టు తొలగింపు



రోడ్డుపై షిల్టును జేసీబీ, ట్రాక్టర్ల సాయంతో తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్

రంగంపేట: మండల పరిధిలోని మర్రిపూడి గ్రామంలో సర్పంచ్ వేము మాధవి ఆధ్వర్యంలో పంచాయతీ అధికారులు, సిబ్బంది గ్రామంలో డ్రైన్లు, మురుగు కాలువల్లో పేరుకుపోయిన షిల్టును తొలగించారు. అయితే తీసిన షిల్టు రోడ్ల పక్కన వేసి వదిలేయడంతో గ్రామస్తులకు ఇబ్బందిగా మారింది. రోడ్ల పక్కన వేసిన షిల్టు తొలగించాలని గ్రామస్తులు కోరడంతో ఈ నెల 4న 'డ్రైనేజీల షిల్టుతో సమస్యలు' పేరిట సాక్షి దిన పత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన గ్రామ సర్పంచ్ వేము మాధవి, పంచాయతీ అధికారులు ఆదివారం రోడ్డు ప్రక్కనున్న షిల్టును జేసీబీ, ట్రాక్టర్ల సహాయంతో గ్రామం బయటకు తరలించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అగ్నిగుండం తొక్కిన భవానీలు



పందలపాక శ్రీదేవీ ఆలయం వద్ద అగ్ని గుండాన్ని తొక్కుతున్న భవానీలు

బిక్కవోలు: మండలంలోని పందలపాక వెలమపేట రామాలయం వద్ద కొలువైన శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం తెల్లవారుజామున భవానీలు అగ్ని గుండాన్ని తొక్కారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద కమిటీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భవానీలు శనివారం ఉదయం నుంచి ఉపవాసం ఉండి అమ్మవారి సేవల్లో పాలు పంచుకున్నారు. రాత్రి నుంచి కాకినాడ జిల్లా తొండంగి గ్రామానికి చెందిన బారా బాబూరావు ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామి పాటలతో అలరించారు. కార్యక్రమంలో విశేషంగా భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బొడ్డు శ్రీనివాసరావు, రామలక్ష్మీ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

వారాహి శక్తి పీఠంలో చీర సారె ఉత్సవం



జి.మామిడాడ వారాహి శక్తి పీఠంలో అమ్మవారికి చీర సారె ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు



విజయదుర్గా అమ్మవారు

పెదపూడి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గోరోజు ఆదివారం కనకదుర్గాదేవి అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని జి.మామిడాడ గ్రామంలో గల వారాహి శక్తి పీఠంలో అమ్మవారికి చీర సారె ఉత్సవం నిర్వహించారు. గ్రామాల్లో దుర్గాదేవి మండపాల వద్ద పెద్ద ఎత్తున భక్తులు ఉదయం అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పలు చోట్ల అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

భక్తి శ్రద్ధలతో శరన్నవరాత్ర ఉత్సవాలు



చంద్రేడులో అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు



వడిశలేరులో లలితా త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు



రంగంపేటలో అన్నపూర్ణా దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు

రంగంపేట: పవిత్ర శరన్నవరాత్ర ఉత్సవాలు నాల్గవ రోజైన ఆదివారం మండలంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రంగంపేటలో దేవీ సెంటర్ ఆలయంలో ఉదయం అభిషేకాలు అనంతరం కలశస్థాపన, సహస్రనామ కుంకుమార్చన చేసి అమ్మవారిని అన్నపూర్ణ దేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నాగేంద్రశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. కట్టుపొంగలి నైవేద్యంగా సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు, భవానీ మాలదారులు ఆలయానికి పోటెత్తి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని వెండి, బంగారు ఆభరణాలు, గజమాలలతో సుందరంగా అలంకరించారు.

చంద్రేడులో..

స్థానిక కాత్యాయనీ సమేత శ్రీచంద్రశేఖర స్వామి ఆలయంలో నాల్గవరోజు అమ్మవారిని అన్నపూర్ణ దేవిగా అలంకరించారు. ఉదయం అభిషేకాలు అనంతరం అమ్మవారిని వెండి, బంగారు నగలతో అలంకరించారు. అనంతరం కుంకుమ పూజలు నిర్వహించారు. వడపప్పు, చలిమిడి, పానకం, పులిహోర నైవేద్యంగా సమర్పించారు. భక్తులు భారీగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

దొంతమూరులో..

గ్రామంలోని శ్రీ విజయదుర్గాదేవి 6వ నవరాత్రి మహోత్సవాలను నాల్గవ రోజు ఆదివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు జటప్రోలు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణలు చేశారు. అనంతరం కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈలకొలనులో..

గ్రామంలో కొలువైయున్న ముత్యాలమ్మతల్లి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

వడిశలేరులో...

విజయదుర్గా అమ్మవారిని నాల్గవ రోజు లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. అధిక సంఖ్యలో భవానీ మాలదారులు, భక్తులు పాల్గొన్నారు. దొడ్డిగుంట, సింగంపల్లి, కోటపాడు, ముకుందవరం, వడిశలేరు తదితర గ్రామాలలో ఆలయాల వద్ద విజయ దశమి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారి మండపాల్లో కుంకుమ పూజలు నిర్వహించారు.

శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో దుర్గమ్మ

బిక్కవోలు: దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మండల పరిధిలోని పలు గ్రామాల్లో అమ్మవారిని శ్రీ లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం పందలపాక శ్రీదేవి అమ్మవారు, రాజరాజేశ్వరీ ఆలయం, సంతోషిమాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కొమరిపాలెం గ్రామంలోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయం, బిక్కవోలు పార్వతీ దేవి, ఊలపల్లి గ్రామంలో శ్రీ కనకదుర్గమ్మ తల్లి, తొస్సిపూడి నవదుర్గ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

సామూహిక కుంకుమార్చనలు



జగన్మాతకు సమర్పించిన సారె



లలితా సహస్రనామ పారాయణ చేస్తున్న భక్తులు



శ్రీరామనగరం శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో బాలాత్రిపురసుందరి అవతారంలో అమ్మవారు



నోట్ల కట్టల దండల అలంకారంలో గాదాల రాజరాజేశ్వరి అమ్మవారు

రాజానగరం: దసరా ఉత్సవాలలో భాగంగా ప్రసిద్ధి చెందిన స్థానిక శ్రీరాజలింగేశ్వర స్వామి, శ్రీరాజగోపాల స్వామి ఆలయ ప్రాంగణాలలో కొలువైన శ్రీరాజరాజేశ్వరీ దేవికి ఆదివారం గ్రామానికి చెందిన కూరాకుల నరసింహారావు, లక్ష్మీదుర్గ దంపతులు చీర, సారెను సమర్పించారు. దసరా ఉత్సవాలలో చేపట్టిన ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు మహిళలు భాగస్వాములై పలు రకాల పిండి వంటలు తయారుచేసి జగన్మాతకు సారెను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తి శ్రద్ధలతో సామూహిక కుంకుమార్చనలు చేసి, లలితా సహస్రనామ పారాయణ చేశారు. జగన్మాతకు సమర్పించిన సారెను వచ్చిన భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు.

ఆలయాలు కిటకిట

సీతానగరం: మండల గ్రామాల్లో కనకదుర్గ అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శరన్నవ రాత్ర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నాలుగో రోజు బాలా త్రిపురసుందరి దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. సింగవరం పంచాయతీ పరిధిలోగల నాగరత్నం కాలనీ, రాపాక పంచాయతీ పరిధిలోగల శ్రీరామనగరంలో గల కనకదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలా త్రిపుర సుందరి దేవి అలంకరణలో అమ్మవారు ఉదయం 4 గంటల నుంచి భక్తులు దర్శించారు. రఘుదేవపురం, చినకొండేపూడి, సీతానగరం వెలమపేట, వెదుళ్లపల్లి, కాటవరం తదితర గ్రామాల్లో అమ్మవారి ఆలయాలు భక్తులతో రద్దీగా ఉన్నాయి.

లలితా త్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మ

మధురపూడి: కోరుకొండ మండలంలో శరన్నవ రాత్రి ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ఆదివారం అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజ లు జరిగాయి. భవానీ మాలధారణ చేపట్టిన భక్తులంతా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమ పూజలు నిర్వహించారు. గాదాల రాజరాజేశ్వరి అమ్మవారికి పదివేల రూపాయల నోట్లతో దండను వేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భవానీ మాల ధారణ చేసిన వారందరికీ ఉదయం, మధ్యాహ్నం, రాత్రివేళల్లో అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. కాపవరంలోని రాజరాజేశ్వరీ అమ్మవారు పూజలందుకున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రాత్రివేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తున్నారు.